ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రజా సమస్యలపై
చిత్తశుద్ధితో పనిచేయండి

స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలపై అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. ఆమె అధ్యక్షతన 1 నుంచి 7 స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరిగాయి. సమావేశాలను ఆమె ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు వేయగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ నూరు శాతం జరుగుతోందా ? అని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రశ్నించారు. దీనికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర బదులిస్తూ ప్రతి నెలా 1వ తేదీన 98 శాతం పింఛన్లు అందజేస్తున్నట్టు తెలిపారు. అందుబాటులో లేని మిగిలిన వారికి మరుసటి రోజున పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అప్పటికీ గ్రామాలలో పింఛన్ల విషయంలో ఏమైనా ఇబ్బంది వస్తే స్థానిక ఎంపిడిఒకు తెలియజేయాలని, వెంటనే తగు చర్యలు తీసుకుంటారని ఆమె తెలిపారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ స్థలం ఉన్న రైతులు మొక్కల పెంపకాన్ని ఎంజిఎన్ఆర్ఎస్ ద్వారా చేపట్టవచ్చని తెలిపారు. గ్రామాలలో మురుగు నీటి సమస్యను నివారించడం కోసం మురుగు కాలువలు చివరి ప్రదేశాలలో ఇంకుడు గోతుల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో మూడు వరకు కమ్యూనిటీ ఇంకుడు మిగతా 2లో..

సమస్యలను లేవనెత్తిన గంగరాజు



ప్రశ్నిస్తున్న గంగరాజు

సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు జెడ్‌పి రెండో స్థాయీ సంఘాల సమావేశంలో గిరిజన ప్రాంతం ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో సమస్యలపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా మంజూరు చేసే వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి సచివాలయ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. నిరుద్యోగ యువతకు బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయాలన్నారు. వెటర్నరీ డిపార్టుమెంట్ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా సెంట్రల్ గవర్నమెంట్ అండర్ టేకింగ్‌లో కోట్లాది రూపాయలు మంజూరై ఉపయోగపడకుండా మిగతా 2లో..

బహుముఖ ప్రజ్ఞాశాలి రమణరావు

◆ ఆయన మృతితో గాజువాకలో విషాద ఛాయలు ◆ పలువురు సంతాపం



నివాళి అర్పిస్తున్న జగ్గునాయుడు



రమణరావు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గాజువాక

బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందిన సిపిఎం సీనియర్ నాయకులు పివైవి.రమణరావు (74) మంగళవారం ఉదయం గాజువాక పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో పారిశ్రామిక ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రజాశక్తి దినపత్రికను పాఠకులకు అందించేందుకు వెళ్తున్న ఆయనను రాంగ్ రూట్‌లో మోటారు బైకుపై వచ్చిన ఓ వ్యక్తి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన రమణరావును నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందారు. ఆయన అంత్యక్రియలు బుధవారం ఉదయం 8 గంటలకు గాజువాకలో జరగనున్నాయి.

రమణరావు 1951 ఆగస్టు 12న విజయవాడ బందరు దగ్గర కొత్తపూడిలో జన్మించారు. విద్యాభ్యాసమంతా విజయవాడలో కొనసాగింది. 1973లో బిహెచ్‌పివిలో ఉద్యోగిగా చేరారు. 1981లో సిపిఎంలో సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ శాఖా కార్యదర్శిగానూ, బిహెచ్‌పివి ఎఫ్‌సి, గాజువాక జోన్ కమిటీ, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యునిగానూ బాధ్యతలు నిర్వహించారు. క్రమశిక్షణ కలిగిన పార్టీ నాయకులు. డివైఎఫ్ఐలోనూ పనిచేశారు. కళాకారుడుగా 1980లో బిహెచ్‌పివిలో ప్రజానాట్య మండలిని నిర్మించారు. పలు కళా ప్రదర్శనలు ఇచ్చారు. హల్లాబోల్ వీధి నాటిక, ప్రజా ఉద్యమ నాటికలు సుమారుగా 600 ప్రాంతాల్లో ప్రదర్శించారు. ఎవ్వనిచేజనించు, ఉప్పెన వచ్చింది, నరకం మరి ఎక్కడలేదు, రాయి మొదలగు నాటికలను జాతీయంగా ప్రదర్శనలు ఇచ్చారు. బహుమతులు సాధించారు. గాజువాక ప్రాంతంలో సిపిఎం బలోపేతానికి కృషి చేశారు. ఇళ్ల స్థలాల పోరాటంలో కీలకభూమిక పోషించారు.

ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. కార్మికులకు రాజకీయ విద్య చెప్పడంలో గట్టి కృషి చేశారు. సాహిత్యం అమ్మకం, ప్రజాశక్తి చేర్పింపు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రజా ఉద్యమ నిర్మాణంలోకి కుటుంబాన్ని తీసుకొచ్చారు. బిహెచ్‌పివిలో జరిగిన అన్ని ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. ఆయన ఎలక్ట్రీషియన్ కావడం వల్ల పార్టీ నిర్మించిన భవనాలన్నింటికీ మిగతా 2లో..

16వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె
వార్త 2లో..

పెదజాలారిపేటలో సివిల్ మాక్ డ్రిల్
వార్త 2లో..

200 కిలోల గంజాయి స్వాధీనం
వార్త 2లో..

డిప్యూటీ మేయర్‌పై ఉత్కంఠ

◆ 'కూటమి' నుంచి పెరుగుతున్న ఆశావహులు ◆ చంద్రబాబు వద్దకు పంచాయితీ
◆ అమరావతికి టిడిపి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పయనం ◆ నేడు తేలనున్న అభ్యర్థి




ఆశావహులు ఉషశ్రీ, దల్లి గోవింద

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 19న జరగనున్న డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా గ్రేటర్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించడానికి ప్రభుత్వం ఓకే చెప్పింది. దీనికి సంబంధించిన సమావేశ సమాచారం ఈ నెల 15న కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులకు జివిఎంసి అధికారులు తెలియజేయనున్నారు. డిప్యూటీ మేయర్‌గా వైసిపికి చెందిన జియ్యాని శ్రీధర్ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తికావడంతో కూటమి పక్షాలు ఇటీవలే అవిశ్వాసం ప్రకటించి ఇన్‌ఛార్జి కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌కు నోటీసును ఇచ్చి డిప్యూటీ మేయర్‌కు ఉద్వాసన పలికారు. ఈ నెల 19న డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు సాగుతున్నాయి. 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు కలసి ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. కొద్ది రోజుల క్రితం వైసిపికి చెందిన నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాసం ప్రకటించి మేయర్ స్థానం నుంచి దించేసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో టిడిపి కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఎన్నుకోబడ్డారు. తాజాగా డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుండడంతో టిడిపి ఎమ్మెల్యేలు మొదటి డిప్యూటీ మేయర్ స్థానాన్ని తమ వారికే కేటాయించాలని పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్దకు మంగళవారం రాత్రి అమరావతి ప్రయాణం అయ్యారు. వారి వెంట ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు కూడా ఉన్నారు. బుధవారం నాటికి డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎవరన్నది స్పష్టంగా తెలియనున్నట్లు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయండి

గోతుల నిర్మాణం ఈ పథకం నిధుల ద్వారా చేపడతామని చెప్పారు. అరుకు జెడ్‌పిటిసి శెట్టి రోషిని మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఫాగింగ్ చేపట్టడం లేదని, అందువల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. 108 అంబులెన్సులు సకాలంలో స్పందించడంలేదని, దీని కారణంగా గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదు చేశారు. సుభద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతమైన పాడేరు మండలంలో 108 సౌకర్యం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తన నోటీసుకు వచ్చిందని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా పెండింగ్ కనెక్షన్లు, కొన్ని ప్రాంతాల్లోని ఇతర సమస్యలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ లేవనెత్తిన ప్రశ్నలకు ఆమె బదులిస్తూ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.రాజ్ కుమార్, మూడు జిల్లాల వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను లేవనెత్తిన గంగరాజు

మురిగిపోతున్నాయని తెలిపారు. వందలాది గిరిజన యువత నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. బ్యాంకుల అధికారులు అంగీకారం చెప్పని కారణంగా నిరుద్యోగ యువత రుణాలు పొందలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా అల్లూరి సీతారామరాజు జిల్లా 11 మండలాల్లో గిరిజన ప్రాంతాల్లో పొలాలు, గరువులు పనులు చేయడమే కాకుండా కాఫీ తోటల్లో బెంచి కట్టింగ్, టెరాసింగ్ పనులు చేపట్టడం, అలాగే మరికొన్ని ప్రాంతాల్లో జీడి మామిడి తోటల పెంపకం కోసం పనులు చేసేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. కేటిల్ షెడ్స్ నిర్మించిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని కోరారు. షోక్ ఫిట్స్ అన్ని గ్రామాలలో నిర్మించాలన్నారు. ఎపిడెమిక్ సీజన్ ప్రారంభం కావడంతో దోమల కాటుతో మలేరియా, టైఫాయిడ్, డెంగీలాంటి జబ్బులు వెంటాడుతున్నాయన్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని కోరారు

డిప్యూటీ మేయర్‌పై ఉత్కంఠ

సమాచారం.

ఆశావహులు వీరే..

డిప్యూటీ మేయర్‌ను జనసేనకు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తొలుత ప్రచారం సాగింది. కానీ టిడిపి నేతలు తాజాగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కాపు సామాజిక తరగతి కాబట్టి అదే సామాజిక తరగతి నుంచి అవకాశాన్ని టిడిపికే కల్పించాలని పట్టుబడుతున్నారు. మేయర్ స్థానం టిడిపికి ఉన్నందున డిప్యూటీ తమకివ్వాలంటూ జనసేన కార్పొరేటర్లు కొంతమంది కోరుతున్నారు. ఆ పార్టీకి 14 మంది వరకూ మద్దతు ఉంది. వైసిపి నుంచి జనసేన పార్టీలోకి చేరిన 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కాపు సామాజిక తరగతికి చెందిన వారైనందున ఆమెకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా నగరం నుంచి పేరుతెచ్చుకున్న ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం అవుతూ వస్తుండడంతో ఆమె పేరును జనసేన అధిష్టానం పరిశీలించే అవకాశాలు లేకపోలేదు. జనసేన నుంచి పీతల మూర్తియాదవ్ తనకు అవసరం లేదని లేఖ ద్వారా అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. జనసేన నుంచి దల్లి గోవింద, కందుల నాగరాజు కూడా డిప్యూటీ మేయర్ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. టిడిపి నుంచి గంధం శ్రీను, సేనాపతి వసంతలు ఈ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. బిజెపి నుంచి గంకల కవిత కూడా తనకు కేటాయించాలని కోరుతున్నారు. వైసిపి నుంచి జనసేనకు వచ్చిన వారికి డిప్యూటీ మేయర్ కేటాయించాలంటే బి ఫారం ఇచ్చేటప్పుడు సాంకేతికంగా సమస్య తలెత్తుతుందన్న వాదన కూడా లేకపోలేదు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రమణరావు

ఎలక్ట్రికల్ వర్క్ చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి అనంతరం కుటుంబీకులు ఆయన నేత్రాలను దానం చేశారు.

పలువురు సంతాపం

రమణరావు మృతిపట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, ఎస్.పుణ్యవతి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐద్వా నాయకులు బి.పద్మ, సంతోషం, బిహెచ్‌పివి పూర్వ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.స్వామినాథం, షిప్‌యార్డ్ యూనియన్ పూర్వ ప్రధాన కార్యదర్శి కుమార్ మంగళం, కళాకారులు ఎం.సుందరయ్య, జివిఎస్.రాజేశ్వరరావు పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ పి.మణి, సిఐటియు నాయకులు కె.కిరీటం, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, భెల్ సిఐటియు నాయకులు జిటిపి.ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, నారపరెడ్డి, ఎస్.అప్పారావు, కె.విజయ్ కుమార్, ఆర్.జనార్ధనరావు, ఇ.కనకరావు, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. రమణరావు పార్థివ దేహం వద్ద పలువురు నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

నేడు సంతాప సభ

రమణరావు పార్థివదేహాన్ని బుధవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ చినగంట్యాడలోని ఆయన స్వగృహం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. తర్వాత గాజువాక సిపిఎం కార్యాలయానికి తీసుకొస్తారు. అనంతరం అంత్యక్రియలు జరుగుతాయి.

పెదజాలారిపేటలో సివిల్ మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విపత్కర పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి క్లిష్ట సమస్యలనైనా ధీటుగా ఎదుర్కోవాలని ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ రక్షక దళాలు వారు తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం పెదజాలారిపేట టిడ్కో గృహ సముదాయం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. దీనిలో ప్రధానంగా ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బందాలు కీలకంగా వ్యవహరించాయి. టిడ్కో గహాల్లో పొగబాంబులు పేలగా వాటిని అగ్నిమాపక యంత్రం సాయంతో మంటలను అదుపు చేయడం, క్షతగాత్రులను హుటాహుటిన తాత్కాలిక వైద్యశిబిరానికి తరలించడం, ప్రత్యేక జాగిలాలతో ప్రమాదం జరిగిన ప్రాంతంలో తనిఖీలు చేపట్టడం వంటి విన్యాసాలను పలువురు ఆసక్తిగా తిలకించారు. సాయంత్రం సివిల్ మాక్‌డ్రిల్ నిర్వహించిన అధికారులు, అదే ప్రాంతంలో రాత్రి బ్లాకౌట్ నిర్వహించారు. టిడ్కో గృహసముదాయాలు, సమీప ప్రాంతంలో విద్యుత్ నిలిపివేశారు. చీకట్లో ఉంటే ప్రమాదం తప్పుతుందని పేర్కొంటూ రక్షణ దళాలు అవగాహన కల్పించాయి. భీమిలి ఇన్‌చార్జ్ ఆర్‌డిఒ సుధాసాగర్, జిల్లా అగ్నిమాపకఅధికారి రేణుకయ్య, డివిజనల్ ఫైర్‌అధికారి సింహాచలం, సివిల్ డిఫెన్స్ ఎస్‌డిసి మధుసూదనరావు, ద్వారకా ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, జోన్ -3 కమిషనర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

16వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంత ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్‌ఒ)కు ఉద్యోగ భద్రత కల్పించాలని తలపెట్టిన సమ్మె మంగళవారానికి 16వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వారికి విశాఖ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు మద్దతు ప్రకటించారు. గీత, అరుణ, కల్పన, మణి, పూర్ణిమ, మానస, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక నెహ్రూ చౌక్ వద్దగల నిరసన శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ తదితరులకు సోషల్ మీడియా వేదిక 'ట్విట్టర్' (ఎక్స్) ద్వారా తమ విన్నపాన్ని తెలియజేస్తూ సిహెచ్‌ఒలు క్యాంపెయిన్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు వెంటనే చొరవ తీసుకుని తమ సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. వారికి ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరావు మద్దతు తెలియజేశారు. ఆరేళ్లకే పర్మినెంట్, ఉద్యోగ భద్రత, సమాన వేతనం, జాబ్ చార్ట్ తదితర డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవాని, యమున, రేవతి, నూకాలమ్మ, లక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: దక్షిణ నియోజకవర్గంలో సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించడమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎవిఎన్ కళాశాల వద్ద 'జనవాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. 30,36,37,38 వార్డులకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి బాధలను తెలుసుకున్నారు.

సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా భోగాపురం-రాంబిల్లి మధ్య 4,6,8 వరుసల ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ యాక్సెస్‌కు వియంఆర్‌డిఎ కన్సల్టెంట్ నియమానికి ఆర్‌ఎఫ్‌పి ఆహ్వానించడం జరిగిందని ఛైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం నుండి భోగాపురం బీచ్, రాంబిల్లి సమీప ప్రాంతాల మధ్య రద్దీని తగ్గిస్తూ ప్రయాణ సమయం తగ్గించటం, ఇప్పటికే అభివృద్ధి చేసిన 6 వరసల జాతీయ రహదారికి అనుసంధానించటం లక్ష్యమన్నారు.

ప్రీమియం లెదర్ విభాగంలో నూతన ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: పాదరక్షల మార్కెట్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగాన్ని లక్ష్యంగా చేసుకుంటూ, రేర్ బై రేర్ రాబిట్ తమ మొదటి ఓపెన్ ఫుట్‌వేర్ ప్రీమియం లెదర్ స్లిప్-ఆన్స్ ఫర్మెంట్‌ను ప్రారంభించినట్లు ది హౌస్ ఆఫ్ రేర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పుల్కిత్‌వర్మ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ దిహౌస్‌ఆఫ్‌రేర్ ఆలోచనాత్మకమైన డిజైన్ అన్నారు. ఇవి నిజమైన లెదర్‌తో తయారు చేయబడి, ప్రత్యేకంగా రూపొందించిన ఎర్గనామిక్ సోల్స్‌తో వస్తాయని తెలిపారు.

వీర జవాన్ల కుటుంబాల సంక్షేమ నిధికి విరాళం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: సాయుధ దళాల యుద్ధ క్షతగాత్రుల సంక్షేమనిధికి విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.లక్ష 6 వేల 871 చెక్కును మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్‌హరేంధిర ప్రసాద్‌కు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముళ్లపూడి కోటేశ్వరరావు, అధ్యక్షులు సుంకరణం సూర్యప్రతాప్, కోశాధికారి పిన్నమరాజు సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సేవలో త్యాగం చేసిన సైనికులకు కతజ్ఞతలు తెలిపారు. అటువంటి వారికి దేశ ప్రజల మద్దతు అవసరం అన్నారు.

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఎయు శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవనంలోని మహిళా సిబ్బంది షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో 31 మంది మహిళా సిబ్బంది పాల్గొన్నారు. విజేతగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.మంజుల, రమాదుర్గ టీం నిలిచారు. ద్వితీయస్థానంలో ఎన్.సునీత, వై.శివకుమారి, పి.దీపిక బందం , తతీయ స్థానంలో సి.హెచ్ జ్యోతికుమారి, మమత నిలిచారు.

200 కిలోల గంజాయి స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న అజిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఒడిశా నుంచి విశాఖపట్నం మీదుగా తరలుతున్న 200 కిలోల గంజాయిని ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. నలుగురిని అరెస్టు చేశారు. కేసు వివరాలను మంగళవారం మధ్యాహ్నం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డిసిపి - 1 అజిత వేజెండ్ల వెల్లడించారు. ముందస్తు సమాచారం ప్రకారం.. ఆనందపురం హైవేలో తనిఖీలు నిర్వహిస్తుండగా బోయపాలెం జంక్షన్ వద్ద ఒడిశా నుంచి విశాఖపట్నం వైపుగా వెళ్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని, ఒక బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశామన్నారు. వారి వద్ద నాలుగు బస్తాలలో 40 బ్రౌన్ కలర్ ప్యాకెట్లను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం వారిని విచారించగా అది గంజాయిగా నిర్ధారణ అయిందన్నారు. ఒడిశాలోని కోరాపుట్‌కు చెందిన రఘు హంతల్, నరేంద్ర పాంగి, బినయ మండల్, రబీంద్ర కిలా తక్కువ సమయంలో సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించి వారిని అరెస్టు చేశామన్నారు.

పెరిగిన విద్యుత్ ఛార్జీలతో అవస్థలు



బిల్లులు చూసి 'షాక్'కు గురయ్యామంటున్న జనం

ప్రజాశక్తి -తగరపువలస : వేసవిలో ఉక్కపోతకు తోడు పెరిగిన విద్యుత్ చార్జీలు తమను ఊపిరి సలపనివ్వడం లేదని పేద, మధ్య తరగతి ప్రజలు వాపోతున్నారు. సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీల పేరిట తడిసి మోపెడైన విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు ఒక్క సారిగా నివ్వెరపోతున్నారు. గత, ప్రస్తుత నెలలో విద్యుత్ వాడకానికి, వచ్చిన బిల్లులకు కనుచూపు మేరలోనైనా పొంతన లేదంటూ బెంబేలెత్తి పోతున్నారు. గత ప్రభుత్వం ఎనిమిది సార్లు కరెంట్ బిల్లులు పెంచిందని బాదుడే బాదుడు అంటూ గగ్గోలు పెట్టి ఊరూ వాడా ప్రచారం చేసిన కూటమి పార్టీలు, తాము అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచేది లేదంటూ తెగేసి చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం పంథాను అనుసరిస్తూ విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచడంతో వినియోగదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. తమ ఇబ్బందులను గమనంలో ఉంచుకుని విద్యుత్ భారాలు తగ్గించాలని పేద ప్రజలు కోరుతున్నారు.

బిల్లు చూస్తే షాక్

కరెంట్ బిల్లులు భారీగా పెంచేశారు. వీటిని తగ్గించాలి. లేకుంటే ఇంకా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఒక ఫ్యాన్, రెండు ఫ్రిజ్‌లు, టివి ఉన్నాయి. గత నెలలో రూ.1300 వస్తే ఈ నెలలో ఏకంగా రూ.1800 బిల్లు వచ్చింది.

**కె.సత్యవతి
తగరపువలస**



వాడకం తక్కువ.. బిల్లు ఎక్కువ..

ఫ్యాన్, రెండు బల్బులు వాడుతున్నాం. గత నెలలో రూ.322 బిల్లు వచ్చింది. ఈ నెలలో రూ.457 బిల్లు వచ్చింది. ఇంతలా పెరిగిన బిల్లు చూసి ఆశ్చర్యం వేస్తుంది.

**ఎన్.సూరిబాబు,
భవన నిర్మాణ కార్మికుడు
గొల్లవీధి, తగరపువలస**



బిల్లు పెరిగింది

ఈ నెల కరెంట్ బిల్లు చూసేసరికి ఒక్కసారిగా షాక్ కొట్టినంత పనైంది. రెండే ఫ్యాన్లు, టివి, ఫ్రిజ్, రెండు ట్యూబ్ లైట్లను వాడుతున్నాం. గత నెలలో రూ.810 బిల్లు రాగా, ఈ నెల రూ.900 వచ్చింది.

**బి.రాజు,
ప్రైవేట్ ఉద్యోగి
గొల్ల వీధి, తగరపువలస**



అదనపు ఛార్జీలు ఎక్కువ

పెరిగిన కరెంట్ బిల్లు చూసి బెంబేలెత్తి పోయాను. రెండు ఫ్యాన్లు, ఒక ఫ్రిజ్, 3 ట్యూబ్ లైట్లు, టివి ఉన్నాయి. వాడకం తక్కువగానే ఉంది. అదనపు ఛార్జీలు ఎక్కువ వేస్తున్నారు. గత నెల కంటే ఈ నెల రూ.20 పెరిగింది. ఈ నెల రూ.950 బిల్లు వచ్చింది.

**పి.వాసు
ప్రైవేట్ ఉద్యోగి**





ఇచ్ఛాపురానికి రోడ్డు వెయ్యరూ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ గిరిజన గ్రామమైన ఇచ్ఛాపురం గ్రామానికి సరైన రోడ్డు లేక గ్రామస్తులు పలు అవస్థలు పడుతున్నారు. సుమారు 10 ఏళ్ల క్రితం తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యాన బాకురుపాలెం నుంచి ఇచ్ఛాపురం గ్రామానికి రోడ్డు మంజూరు చేశారు. అప్పట్లో రోడ్డు ఏర్పాటుకు మెటల్ వేసి కొంతమేర తారు రోడ్డు ఏర్పాటుచేశారు. బాకురుపాలెం నుంచి సుమారు కిలోమీటర్ మేర ఫారెస్టు భూములు ఉన్నాయని అటవీ అధికారులు అడ్డు చెప్పడంతో తాత్కాలికంగా మెటల్ వేసి వదిలేసారు. తారు రోడ్డు వెయ్యకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. ఇచ్ఛాపురం గ్రామంలో ఎస్‌టి కులానికి చెందిన సుమారు 55 కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరు ప్రతిరోజూ గ్రామం నుంచి ఏ అవసరానికి అయినా విజయనగరం, విశాఖపట్నం వెళ్తుంటారు. గర్భిణులు, వృద్ధులు ఈ రోడ్డులో ప్రయాణించేటప్పుడు పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు చేరి చెరువులను తలపించే విధంగా రోడ్డు తయారవుతోంది. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో జంతువులు సంచారం, లైట్లు లేకపోవడంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇచ్ఛాపురానికి పూర్తిస్థాయిలో రోడ్డు, లైట్లు ఏర్పాటుచేయాలని ఇచ్ఛాపురం గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం పంచాయతీ పరిధిలో హైవేకు ఆనుకుని ఓరియంట్ హోటల్ పక్కన విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతూ ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవలస నుంచి పెద్దిపాలెం వెళ్లే సర్వీస్ రోడ్డులో ఓరియంట్ హోటల్ పక్కన విద్యుత్ స్తంభాలు విరిగి వైర్లు నేలకొరిగాయి. ఈ ప్రాంతానికి ప్రతిరోజూ పశువులను మేతకు తీసుకొస్తుంటారు. విద్యుత్ వైర్లు ఒకటి తెగిపడి మిగిలినవి నేలకొరిగి ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 15 రోజుల క్రితం విద్యుత్ స్తంభం విరిగి వైర్లు నేలకొరిగాయని గ్రామస్తులు విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా నేటికీ నివారణ చర్యలు చేపట్టలేదని స్థానిక నాయకులు కూరాకుల వెంకటేష్ ఆవేదన వెలిబుచ్చారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, పశువుల కాపరులు, గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



స్తంభం వంగి కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు



ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పి హైస్కూల్‌కు వెళ్లే దారిలో ఒకటి రెండు చోట్ల దెబ్బతిన్న ఇంటి కుళాయి కనెక్షన్లను మంగళవారం జివిఎంసి ఒకటో జోన్ తాగు నీటి సరఫరా విభాగం సిబ్బంది మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. తద్వారా తాగు నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టారు."తాగు నీరు వృథా' శీర్షికన ప్రజాశక్తిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాగు నీటి సరఫరా విభాగం సిబ్బంది క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి తాగు నీరు ఎక్కడ లీకవుతుంది, లోపం ఎక్కడ, ఎక్కడెక్కడ ఇంటి కుళాయి కనెక్షన్లు దెబ్బతిన్నవీ పరిశీలించారు. దెబ్బతిన్న ఇంటి కుళాయి కనెక్షన్లను గుర్తించి సరిచేశారు.

దెబ్బతిన్న కుళాయి కనెక్షన్లను పునరుద్ధరిస్తున్న తాగు నీటి సరఫరా విభాగం సిబ్బంది

నేరాలు ఘోరాలు

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి పోలీసుస్టేషన్ పరిధిలో ఈ నెల 10వ తేదీన ఒక మహిళ అదృశ్యమైనట్లు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన స్థానిక కృష్ణా కాలనీకి చెందిన బి.కవిత (22) తిరిగి ఇంటికి చేరక పోవడంతో బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తల్లి వరలక్ష్మి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కవితకు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

డ్రైవర్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యాన్ డ్రైవర్ జి.సురేష్ కుమార్ (60) ఆకస్మికంగా మృతిచెందాడు. మహారాష్ట్ర రాష్ట్రం నాగపూర్‌కు చెందిన సురేష్‌కుమార్ ఆనందపురం వద్ద ఓ ప్లైవుడ్ కంపెనీలో ఐసర్ వ్యాన్‌ను లోడ్ చేసుకుని బయలుదేరాడు. భీమిలి దొర తోట రోడ్డుకు వచ్చేసరికి స్టీరింగ్‌పై పడుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. పిల్లలు ఫోన్ చేస్తున్నా స్పందించకపోవడంతో ఈ ప్రాంతంలో ఉన్న బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. బంధువులు వెళ్లి చూడగా స్టీరింగ్‌పై పడి ఉన్నాడు. మృతిచెందినట్లు గుర్తించి ఆనందపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు దీపక్ సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువతి మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఏప్రిల్ 27న ఆత్మహత్యకు పాల్పడిన యువతి నాటి నుండి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందింది. కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పాచిలవానిపాలెం గ్రామానికి చెందిన పాచిల యమున (16) గతనెల 27వ తేదీన తన ట్యాబ్లో వీడియో గేమ్‌లు ఆడుతుండగా ఆమె సోదరుడు ఆ ట్యాబ్‌ను బలవంతంగా తీసుకున్నాడు. ఇద్దరూ ట్యాబ్ విషయంలో గొడవ పడుతుండగా ఆమె తల్లి వరలక్ష్మి జోక్యం చేసుకుని ఇద్దరినీ శాంతంపజేసి వ్యవసాయ పనులకు వెళ్లిపోయింది. సాయంత్రం తల్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి యమున బెడ్ రూమ్‌లో ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతుంది. వెంటనే తల్లి ఆమెను కిందకు దించి చొడవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్ తరలించారు. అప్పటినుండి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యమున పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మతి చెందింది. యువతి మేనమామ దొగ్గ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఎస్‌సి' రుణాలకు 16న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్వయం ఉపాధి పథకం కింద ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాల కోసం దరఖాస్తు చేసిన వారికి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు మంగళవారం తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు చెందిన 85 మంది ఈ నెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వేడుకగా భూలోకమాత పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి రేసపువానిపాలెంలో భూలోక మాత అమ్మవారు పండుగను వేడుకగా నిర్వహించారు. వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కర్రి మురళీకృష్ణారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికులకు మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-ఆనందపురం: భారత్ -పాకిస్తాన్ యుద్ధంలో వీర మరణం పొందిన భారత్ సైనికులకు నివాళులర్పిస్తూ ఆనందపురం గ్రామం 24 కాలనీ వద్ద జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. భారతమాత ముద్దు బిడ్డలకు జోహార్ జోహార్, జై జవాన్.. జైజై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్, కోశాధికారి కుప్ప రామలక్ష్మి పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

రోడ్డు ఏర్పాటుతో కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవ నుంచి గోపాలపట్నం సమీపంలోని వెంకటాపురం వరకు రూ.2.3 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించిన పెందుర్తి, గోపాలపట్నం ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, పి. గణబాబులకు స్థానిక జనసేన నాయకుడు గల్ల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం ఉదయం ఆర్ అండ్ బి ఈఈ మురళి, స్థానిక కూటమి నాయకులతో కలిసి రోడ్డును శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా ఈ ప్రాంతంలోని 14 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడే వారిని, సమస్యను ఎమ్మెల్యేలు రమేష్‌బాబు, గణబాబు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించి బీటీ రోడ్డును వేయించారని తెలిపారు. ఇక్కడ సరైన రోడ్డు లేకపోవడంతో గోపాలపట్నం వెళ్లేందుకు చుట్టూ తిరిగి పది కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు నాలుగు కిలోమీటర్ల దూరంలోనే గమ్యస్థానానికి చేరుకుంటున్నామని వెల్లడించారు. 14 గ్రామాల ప్రజల తరపున ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రోళ్ల పైడిమాంబ పండగ

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో ఉన్న రోళ్ల పైడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. వేకువ జాము నుంచే భక్తులు అమ్మవారికి పసుపు,కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అయిత ఎర్నిబాబు, గ్రామ పెద్దలు అయిత యెర్రయ్య, దువ్వి అప్పారావు, కంచిబోయిన వెంకట సంతోష్, అయిత అప్పలరాజు, చిప్పల చందు, సబ్బవరపు ప్రకాష్, బొట్ట గోవింద్, పి.వెంకటరెడ్డి నాయుడు, రెడ్డం హరికుమార్, అయిత అప్పారావు, నోడగల అప్పలరాజు, గొర్లి రవి, బొడ్డేటి వెంకటరావు, అయిత పైడిరాజు, అయిత ఈశ్వరరావు, బొట్ట రాజేష్ కుమార్, దువ్వి కిషోర్ పాల్గొన్నారు.

బంగారు పతకాలకు నగదు బహూకరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం అప్లైడ్ మేథమేటిక్స్ విభాగంలో ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందజేయాలని కోరుతూ ఆస్ట్రేలియాకు చెందిన ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి రాఘవేంద్రరావు కుంబారి రూ.3,00,000 చెక్కును ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్‌కు అందజేశారు. ప్యూర్ మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి ఆచార్య నాగరాజారావు పేరున బంగారు పతకాన్ని అందించాలని కోరారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు పతకాలు అందించడానికి అవసరమైన నిధులను విశ్వవిద్యాలయానికి అందజేసిన దాతలను ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్, అట్టూరి నిర్మల తదితరులు పాల్గొన్నారు.



రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న రాఘవేంద్రరావు

గాజువాకలో నీటి ఎద్దడి

- నిర్వాసిత కాలనీలో రోజు విడిచి రోజు సరఫరా
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజవర్గంలో నీటి సమస్య తీవ్రమైంది. జివిఎంసి 65వ వార్డు పరిధి బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న 200 కుటుంబాలకు మంచినీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు నివసిస్తున్నారు. వారందరూ రోజు కూలి చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీకి చాలా కాలంగా తాగునీటి సమస్య ఉంది. శాశ్వత ప్రాతిపదికన మంచినీటి సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు తప్ప పరిష్కారం చూపడంలేదు. నిర్వాసిత కాలనీలైన కోరాడ, పెద్దకోరాడ, వెంపలనగర్, సిద్ధేశ్వరం ప్రాంతాల్లో రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. తక్కువ ప్రెజర్‌తో నీరు రావడంతో సరిపడా నీటిని పట్టుకోలేకపోతున్నారు. రోజు విడిచి రోజు గంట సమయం పాటు సరఫరా చేస్తుండటం, తక్కువ ప్రెజర్ వల్ల పట్టుకున్న నీరు తాగడానికి మాత్రమే సరిపోతున్నాయి. వాడుకలకు నీరు ఉండటం లేదు. బోర్లు ఉన్న వారు ఆ నీటిని వాడుకుంటున్నా, కుళాయిలపై ఆధారపడిన వారికి సమస్యగా ఉంది. అరుణోదయ కాలనీ, సుందరయ్య కాలనీ, ఉప్పర కాలనీలు కొండలపైన ఉన్నాయి. వీరికి ఐదు బిందెల కంటే ఎక్కువగా మంచినీరు సరఫరా కావడం లేదు. అదికూడా ఏ సమయానికి కుళాయిలు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మంచినీటి కోసం రోజు కూలికి వెళ్లలేక, వదులుకోలేక ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

గాజువాక జాతీయ రహదారిని ఆనుకొని 70వ వార్డు పరిధి లంక గ్రౌండ్ సమీపంలో సెలెక్ట్ పేరుతో భారీ ఎత్తున అపార్ట్‌మెంట్లు నిర్మించారు. వీరు భూగర్భంలో చాలా లోతుకు బోర్లను వేసి నీటిని తోడేస్తుండటంతో వార్డు పరిధిలో ఉన్న ఇళ్ల బోర్లు ఎండిపోయాయి. కాలనీల్లో 100 అడుగుల మేరకు బోర్లను వేసుకొని నీటిని వాడుకునేవారు. ఇప్పుడు 100 అడుగుల బోర్లకు నీరు లేకపోవడంతో వారంతా ఆ బోర్లల్లో 300 అడుగుల వరకు మళ్లీ వేయించుకుంటున్నారు. కుళాయిల ద్వారా తక్కువ ప్రెజర్‌తో అరగంట మాత్రమే ఇస్తుండటంతో నీరు సరిపోవడంలేదు.

వాస్తవానికి కెబిఆర్, మేఘాద్రిగెడ్డ ద్వారా గాజువాక జోన్ పరిధిలో 9 ఎంజిడిల నీరు మాత్రమే సరఫరా అవుతుంది. ఇప్పుడున్న 20 వార్డుల ప్రజలకు 10 ఎంజిడిల మంచినీరు అవసరం ఉంది. ఆ మేరకు కొన్ని కాలనీలో ఉన్న ప్రజలకు మంచినీరు సరఫరా చేయడం లేదు.



సమస్యను పరిష్కరిస్తాం

మోటార్ రిపేర్లు ఉంటే తప్ప ప్రతిరోజూ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఒకవేళ ఎక్కడైనా నీరు రాకపోతే వెంటనే పరిష్కరిస్తున్నాం.

కేదారినాథ్
వాటర్ సప్లై ఎఇ

నీటి సమస్య తీవ్రం



బాపూజీ కాలనీలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. కొత్తగా పైప్‌లైన్ వేస్తామన్నారు కానీ ఇంతవరకు వేయలేదు. కొండలపైకి నీటిని తీసుకొని వెళ్లలేకపోతున్నాం. నీటి సమస్యను పరిష్కరించాలి.

టి.లక్ష్మి

మూడు బిందెల నీరే వస్తోంది



బాపూజీ కాలనీలో మూడు బిందెల కంటే ఎక్కువగా నీరు రావడం లేదు. బాంబే కాలనీ నుంచి తమ కాలనీకి పైప్ లైన్ వేస్తామని చెప్పారు. కానీ వేయలేదు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎం.జ్యోతి

నీటి సమస్య లేకుండా చూడాలి



తాగునీటి సమస్య లేకుండా చూడాలి. తాగునీటి సమస్యపై గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశాం. వేసవిని దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలి.

ఎం.రాంబాబు
సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి

బుల్లయ్య కళాశాల, హెచ్‌పిసిఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ మధ్య ఎంఒయు

ప్రజాశక్తి-సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల, హెచ్‌పిసిఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ మధ్య ఎంఒయు కుదిరింది. రెండు సంస్థల ప్రతినిధులు మంగళవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ, అధ్యాపకులు నూతన పరిజ్ఞానంతో సమకాలీనంగా ఉండటం ఎంత ముఖ్యమో వివరించారు. అధ్యాపకులు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌పిసిఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సిఇఒ ఇమ్తియాజ్ అర్షద్ మాట్లాడుతూ, సంస్థ నిర్వహిస్తున్న వివిధ శిక్షణా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, పి.విజయ్ కుమార్, కె.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

రసాయనాలతో... మామిడి 'రసాలు'

- మార్కెట్లో విక్రయాలు
- ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- పట్టించుకోని ఫుడ్ అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం : సీజన్ ప్రారంభానికి ముందే.. మార్కెట్లోకి మిలమిల మెరుస్తూ మామిడి పండ్లు వచ్చేస్తున్నాయి. కాయలు ముదరక ముందే - రసాయనాలతో మగ్గబెట్టి రసాలంటూ దర్జాగా అమ్మేస్తున్నారు. కార్బైడ్, ఇథలిన్, చైనా ప్యాకెట్లు పొడితో రంగు ఇచ్చి మరీ ప్రజలకు అంటగడుతున్నారు. వీటిని తినడం వల్ల అనారోగ్యంతో పాటు, కేంద్రనాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు. అయినా ఆహార తనిఖీ విజిలెన్స్ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రసాయనాల వాడకాన్ని ఆహార చట్టం ప్రకారం పూర్తిగా నిషేధించినా దర్జాగా వాడేస్తూ ప్రజారోగ్యాన్ని పాడు చేస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

ఆనందపురం మండలంలో పందలపాక, తర్లువాడ, ముచ్చర్ల, ఇచ్చాపురం, కుసులవాడ వెల్లంకి పద్మనాభం మండలం తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ ఉదయం ఆనందపురం మార్కెట్‌కు మామిడి పండ్లు తీసుకొచ్చి అమ్మకాలకు జరుపుతారు. వీటిని మారు వ్యాపారస్తులు కొనుగోలు చేసి విశాఖ, విజయనగరం తదితరచోట్ల అమ్మకాలు జరుపుతున్నారు.

రసాయనాల బదులు సురక్షిత పద్ధతుల్లో మాగబెట్టే విధానాలు ఉన్నా వాటిని ఆచరించడం లేదు. రసాయనాలు వినియోగించే వారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు ప్రత్యామ్నాయ పద్ధతులపై వ్యాపారుల్లో అవగాహన తీసుకురావడంలో అధికారులు విఫలమవుతున్నారు. మామిడిలో సహజసిద్ధంగా ఇథలిన్ ఎంజైమ్ ఉంటుంది. దీని కారణంగానే కాయలో ఉండే పిండి పదార్థం చక్కెరగా మారుతుంది. దీనివల్ల పండు మాగుతుంది. సాధారణంగా బాగా పండిన కాయలను గాలి చొరబడని ప్రదేశంలో ఉంచితే నాలుగు రోజులలో పక్వానికి వస్తాయి.



ఆనందపురం మార్కెట్‌కు వచ్చిన మామిడి పండ్లు

ఇలా సురక్షితమైన పద్ధతుల్లో పండ్లను మాగబెట్టే అవకాశాలున్నా ప్రజారోగ్యాన్ని దెబ్బతీసేలా రసాయనాలను విరివిగా వినియోగిస్తున్నారు.

దేశ వ్యాప్త సమ్మెపై విస్తృత ప్రచారం



కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మంగళవారం విస్తృతంగా ప్రచారం జరిగింది. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక, కర్షక, ప్రజా సమస్యలను పరిష్కరించాలని జరుగుతున్న ఈ సమ్మెను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

కంచరపాలెం : ఈ నెల 20వ తేదీన చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సిఐటియు ఆధ్వర్యాన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కంచరపాలెం జోన్ ప్రధాన కార్యదర్శి ఒ.అప్పారావు మాట్లాడుతూ, పదేళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులు, సంక్షేమానికి ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసిందని తెలిపారు. లేబర్ కోడ్‌లు తీసుకురావడం వల్ల కార్మికులకు సంఘాలు ఉండవని, కార్మికులకు యజమానులు ఎంత ద్రోహం చేసినా శిక్షలు లేకుండా చేశారని తెలిపారు. పాత కార్మిక చట్టాల అమలుకు, ఖాళీ పోస్టుల భర్తీకి, కార్పొరేట్లకు ఇచ్చిన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు రెండెకరాలు చొప్పున పంపిణీ చేయాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌తో చేపట్టే ఈ సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ ప్రెసిడెంట్ బి.సింహాచలం, డి.చిరంజీవి,



రాంబిల్లిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కార్మికులు

హెచ్.అప్పారావు, శంకర్, సత్యనారాయణ, ఢిల్లీరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద ఈ నెల 20వ తేదీ సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎంవి.ప్రసాద్ మాట్లాడుతూ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. 20వ తేదీ సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్.శేషుబాబు, జి.కిరణ్, బి.రాంబాబు, డి.సూరిబాబు, రామకృష్ణ, డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : మే 20వ తేదీన జరపతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలను కోరుతూ జివిఎంసి 96వ వార్డు పరిధి రాతి చెరువు వద్ద ఆటో, మోటారు కార్మికుల యూనియన్ ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, పెందుర్తి ఏరియా కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 లేబర్ చట్టాలను రద్దు చేసి కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్‌ను తెచ్చిందని, దీనిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి పెందుర్తి నాయకులు వై.రాంబాబు, రాతిచెరువు శ్రీ సంపత్ వినాయక ఆటో స్టాండ్, జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ కాలనీల నాయకులు రమేష్, శ్రీను, కాళిదాసు, ప్రసాద్, రమేష్, ముకుంద, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీయుపి స్కూల్లో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఎం.జానకి, ఉమా, పైడితల్లమ్మ పాల్గొన్నారు.

రాంబిల్లి : 20న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం రాంబిల్లిలో ప్రచారం నిర్వహించారు. బుక్స్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా



చీడికాడలో...

ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు, నేతలు ధోని కాసియా, సుజాత, సావిత్రి, మంగ, రమ్య, స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అనకాపల్లి సివిల్ సప్లై యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, సివిల్ సప్లై యూనియన్ నేతలు కె త్రినాద్, వియ్యపు రాజు, పి.సింహాచలం, గోవిందరావు, నాగ శంకరరావు పాల్గొన్నారు.

అంగన్వాడీలు, విఒఎల సమ్మె నోటీసులు

కె.కోటపాడు : ఈ నెల 20న జరుగుతున్న సమ్మెలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటియు) ఐకెపి వివోఎల సంఘం ఆధ్వర్యాన అంగన్వాడీలు, విఒఎలు పాల్గొంటున్నట్లు ఆయా సంఘాల నేతలు తెలిపారు. ఈ మేరకు ఐసిడిఎస్ పిఒకు అంగన్వాడీ యూనియన్ నేతలు, ఐకెపి ఎపిఎంకి విఒఎల సంఘం నేతలు మంగళవారం వేర్వేరుగా సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి కుమారి మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జీవో 8ను మార్పుచేసి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెండు సంఘాల నేతలు ఎం లక్ష్మి, కర్రి సత్యం, భవాని రామలక్ష్మి, సిఐటియు నాయకులు ఈ.నాయుడు బాబు గండి నాయనబాబు పాల్గొన్నారు.



కె.కోటపాడులో సమ్మె నోటీసు ఇస్తున్న దృశ్యం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలంలో పాడైపోయిన రోడ్లను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. జనసేన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అనకాపల్లి ఆర్ అండ్ బి ఏఈ, ప్రభుదాస్‌తో కొణతాల మాట్లాడారు. కొత్తూరు పంచాయతీ ఏఎమ్ఎఎల్ కాలేజీ ఫ్లైఓవర్, కొత్తూరు రోడ్డు పనులు, తుమ్మపాల చినబాబు కాలనీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, అమృత్ పథకం డిఈ, కశింకోట మండలం ఎమ్మార్వో, సివిల్ సప్లై డిటి, రెవెన్యూ అధికారులు ఈ సందర్భంగా శాసనసభ్యులు రామకృష్ణను కలిశారు. వారి పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేయవలసిన పనులు గురించి చర్చించారు.



మాట్లాడుతున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

లింక్ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-చోడవరం : నియోజకవర్గంలో గ్రామాలకు అనుసంధానమయ్యే లింకు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బుచ్చయ్యపేట మండలం రాజాం నుండి తట్టుబంద రోడ్డు 4.3 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.1.40 కోట్లు, గున్నెంపూడి- పెదమదీనా నుంచి వయా చింతపాక మీదు సీతయ్యపేట రోడ్డు 3.3 కిలోమీటర్లకు కోటి రూపాయలు, కొత్తకోట నుండి రొచ్చు పనుకు రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. పనులు వెనువెంటనే ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

17న సివిల్స్, గ్రూప్-1 పరీక్షలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీ గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు వైజాగ్ ఐఎఎస్ అకాడమీ సహకారంతో గౌరీ గ్రంథాలయంలో యుపీఎస్‌సీ (సివిల్స్), ఏపీపీఎస్‌సీ గ్రూప్-1 పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైజాగ్ ఐఎఎస్ అకాడమీ డైరక్టర్ గౌతమ్ పోతల, యుపీఎస్‌సీ (సివిల్స్)-2025 విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని మానస, మరికొంతమంది నిష్టాతులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. సదస్సుకు హాజరు కాదలచిన ఔత్సాహిక విద్యార్థులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9247166511 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీ కూలీలు భాగస్వాములు కావాలి

సిఐటియు, వ్యకాస నేతల పిలుపు



దేవరాపల్లిలో క్యారేజీలు చూపిస్తూ నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-పరవాడ : ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు బడ్జెట్లో నిధులు పెంచాలని ,పెండింగ్ బకాయిలు చెల్లించాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 20న కార్మిక, కర్షక సంఘాల పిలుపు మేరకు జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని బొద్దపు వానిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను పని ప్రదేశంలో మంగళవారం గనిశెట్టి కలిసి మాట్లాడారు. గతంలో మంచినీళ్ళు, టెంట్, ఎండాకాలంలో మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, సమ్మర్, పనిముట్ల అలవెన్స్‌లు ఇచ్చేవారని, కాని నేడు అవేవీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ డిమాండ్లపై దేశవ్యాప్తంగా జరుగు సమ్మెలో ఉపాధి హామీ కూలీలు భాగస్వాములు కావాలని కోరారు.

దేవరాపల్లి : మండలంలోని తిమిరాం, వెంకటరాజుపురం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న ఆధ్వర్యాన మంగళవారం తమ కేరేజీలు పట్టుకొని వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్‌లో పని చేస్తున్న దాదాపు 15 వేల మంది ఉద్యోగులు, సిబ్బంది మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కూలీలకు 15 రోజుల లోపే కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉండగా రెండు నెలలుగా



పరవాడ బొద్దపువానిపాలెంలో మాట్లాడుతున్న గనిశెట్టి

ఇవ్వలేదని, ఇలా వారి ఎలా బతుకుతారని ప్రశ్నించారు. డిమాండ్ల సాధనకు ఈనెల 20న ఉపాధి పనులు బంద్ చేసిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అదిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని మర్రి బందలో మంగళవారం ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని, దాని పరిరక్షణకు ఈ నెల 20న ఉపాధి హామీ కార్మికులు కూలీ పనులు బహిష్కరించి సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

శత్రుదాడిని ఎదుర్కోవడంపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి- అనకాపల్లి : శత్రువులు దాడి చేసినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై బుధవారం ఉదయం మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి తెలిపారు. భారతదేశంలో శత్రు దాడి పరిస్థితి సంభవించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించు నిమిత్తం రెవిన్యూ డివిజినల్ అధికారి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అనకాపల్లి జిల్లాలోని అత్యవసర సంసిద్ధతపై పట్టణ ప్రాంతాలలో అవగాహన కల్పించేందుకు గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ, బైపాస్ రోడ్, జయభేరి మారుతీ షోరూం ఎదురుగ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ముత్యాలమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాయవరపు ముత్యాలమ్మ (103) మంగళవారం కన్నుమూశారు. చనిపోయే ముందు వరకు చలాకీగా తన పనులు తానే చేసుకునేవారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ముత్యాలమ్మ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె మృతికి గ్రామస్తులు సంతాపం తెలిపారు.

15 కేజీల బెండకాయలు రూ.20

★ దేవరాపల్లి మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్
★ మనస్తాపం చెందిన రైతులు రోడ్డుపై పారబోసి ఆవేదన వ్యక్తం
★ కోల్డ్ స్టోరేజ్, దళారీ వ్యవస్థ నిర్మూలన వంటి నేతల మాటలు నీటి మూటలే...

ప్రజాశక్తి-దేవరాపల్లి

కూరగాయల వ్యాపారుల దోపిడీ ఏ స్థాయిలో ఉందో దేవరాపల్లి మార్కెట్‌లో మంగళవారం బెండకాయల కొనుగోలు చేసిన తీరు చూస్తే అర్థమవుతుంది. గాజువాక ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సంతల్లో కేజీ బెండకాయలు రూ.40 నుండి రూ.50 వరకు అమ్ముతున్నారు. విశాఖపట్నం రైతు బజార్లలో అయితే కేసీ రూ.30 వరకు విక్రయిస్తున్నారు. అంతంత ధరలకు విక్రయిస్తున్న కూరగాయల వ్యాపారులు రైతుల దగ్గర మాత్రం కారు చౌకగా, కనీస ధర కూడా ఇవ్వకుండా కొనుగోలు చేస్తూ నిలువ దోపిడీకి పాల్పడుతున్నారు.

దేవరాపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్ సమీపంలో రోజువారీ నిర్వహించే మార్కెట్‌లో మంగళవారం బెండకాయలు 15 కేజీల కేట్ రూ.20కు వ్యాపారులు కొనుగోలు చేశారు. అంటే కేజీ బెండకాయలు రూ.1.50 కూడా పడలేదు. వ్యాపారులంతా సిండికేట్ అయి ధర ఏ మాత్రం పెంచడానికి ఇష్టపడలేదు. దీంతో చేసేది లేక కొంత మంది రైతులు ఆ ధరకే ఇచ్చేయగా, మరికొంత మంది రైతులు తీవ్ర మనస్తాపంతో తెచ్చిన బెండకాయలను రోడ్డుపై పారబోసి తమ ఆవేదన వెల్లబుచ్చారు. ఈ రూ.20లోనే రూ.10 ఆశీలు కూడా చెల్లించారు.


రైతులు రోడ్డుపై పడేసిన బెండకాయలు

వీటితోపాటు వంకాయలు, గోరుచిక్కుడు, బీరకాయలు తదితర కూరగాయలను కూడా అంతంత మాత్రం ధరలకే వ్యాపారులు కొనుగోలు చేశారని రైతులు వాపోయారు. విత్తనాలు, పురుగు మందులు, కలుపు నివారణ, కూలీ ఖర్చులు ఇలా పంట పండించాలంటే పెట్టుబడులు అధికంగా పెరిగాయి. కాని పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని, పెట్టిన పెట్టుబడి రాకపోగా కనీసం కూలి డబ్బులు కూడా కిట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

దేవరపల్లి మార్కెట్‌కు రైవాడ, కాశీపురం, చిన్ననందిపల్లి, పెదనందిపల్లి, ఎం అలమండ, వేచలం, మామిడిపల్లి, మారేపల్లి, తెలుగుపూడి, గరిసింగి, విజయనగరం జిల్లాలోని నల్లబిల్లి తదితర గ్రామాల నుంచి రైతులు కూరగాయలు విక్రయానికి తీసుకొస్తుంటారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ అయి సరైన ధర ఇవ్వకపోవడంతో తెచ్చిన కూరగాయలను తిరిగి తీసుకెళ్లలేక వారు చెప్పిన ధరకే రైతులు విక్రయిస్తున్నారు. దీంతో కనీసం ఆటో అద్దెలు కూడా రావటం లేదని రైతులు చెబుతున్నారు.

నేతల మాటలు నీటి మూటలే...

ప్రభుత్వాలు మారుతున్నాయి, ప్రజాప్రతినిధులు మారుతున్నారు. కాని దేవరాపల్లి డైలీ మార్కెట్ తీరే మారడం లేదు. ఈ మార్కెట్‌కు కూరగాయలు తెస్తున్న రైతుల వెతలు ఏ ఒక్కరికీ పట్టడం లేదు. దేవరపల్లి మార్కెట్‌లో రైతులకు కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేస్తామని, దళారీ వ్యవస్థ లేకుండా కూరగాయలు అమ్ముకునే విధంగా చేస్తామని ఎన్నికల్లో ప్రధాన పార్టీల నాయకులందరూ చెప్పారు. తీరా గెలిచాక వాటి గురించి పట్టించుకునే నాథడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి దేవరాపల్లిలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేయాలని, దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని పలువురు కూరగాయల రైతులు కోరుతున్నారు.


బెండకాయలు అమ్ముడుకాక దిగాలుగా ఉన్న రైతులు


ఐద్వా ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న మహిళలు

పాత స్థలంలోనే ప్రభుత్వ ఆసుపత్రిని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పాత స్థలంలోనే పునరుద్ధరించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన మంగళవారం పాత ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, కార్యదర్శి డిడి వరలక్ష్మి మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి మెయిన్ రోడ్డు నుండి తులసీనగర్‌కు మారడంతో రోగుల పరిస్థితి అయోమయమైందన్నారు. ఆసుప్రతికి వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో తగిన వసతులు లేక అక్కడ పనిచేసే సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కావున పాత జాతీయ రహదారి ఆనుకొని ఉన్న స్థలంలోనే తిరిగి ఏరియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టి రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు గొర్రెల పద్మ, పిల్లా హైమ, ఎర్రం చిట్టి, కాంతం, బంగారు నూకాలమ్మ, పూలు సత్యవతి, మొల్లేటి ఈశ్వరమ్మ, బి.సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మర్లమ్మతల్లి మహోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పెదనాయుడుపాలెం గ్రామంలో శ్రీమర్లమ్మ తల్లి అమ్మవారి పండుగ అనుపు మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ గండి బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొర్లి శ్రీనివాసరావు, సబ్బవరపు నాగభూషణ్, సబ్బవరపు దేముడు (నాగేంద్ర), సబ్బవరం సత్యనారాయణ, బుజ్జి నారపాడ సూర్య, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : శారదానదిపై ఉన్న గ్రోయిన్లను మరమ్మతులు చేయాలని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షులు విల్లూరి పైడారావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు నిధులు మంజూరు చేయించి గ్రోయిన్ మరమ్మతు పనులు మొదలు పెట్టించాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామానికి చెందిన అక్కెరపు వెంకట రమణ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 5,00,280 మంజూరు కాగా, ఆ చెక్కును రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మంగళవారం వెంకట రమణ కుటుంబ సభ్యులకు అందజేశారు.

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

అనంతరం కన్నూరుపాలెం టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. టిడిపి గ్రామ అధ్యక్షులుగా చుక్క ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కూండ్రపు కన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా కూండ్రపు పైడిరాజు, తెలుగు మహిళా అధ్యక్షులుగా కన్నూరు అక్కియమ్మ, కార్యదర్శిగా జాగారపు ఈశ్వరమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు కాయలు మురళి, నాయకులు వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను, కూండ్రపు రామునాయుడు, కూండ్రపు అక్కునాయుడు పాల్గొన్నారు.


సిఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న పీలా గోవింద

అంగన్వాడీలను పెన్షన్ డ్యూటీ నుంచి మినహాయించాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు


మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

ప్రజాశక్తి-అనకాపల్లి

అంగన్వాడీ వర్కర్లను సామాజిక పింఛన్ల పంపిణీ విధుల నుంచి మినహాయించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్ల రకరకాల యాప్లతో ఆన్‌లైన్ పనిభారం పెరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో గ్రామాల్లో పెన్షన్ పంపిణీలో సచివాలయం సిబ్బందికి రెండు మూడు నెలలు సహకరించాలని కోరారని, కాని ఇప్పటికి కూడా పెన్షన్ పంపిణీ బాధ్యతల నుండి విముక్తి కలిగించలేదని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఇప్పటికే యాప్లతో పని భారంతో పాటు 1వ తేదీ నుంచి పిల్లల బరువు తీయడం, టిహెచ్‌ఆర్ (టేక్ హెూమ్ రేషన్) పంపిణీ, పిల్లలకు పోషకాహారం వండి పెట్టడం, ప్రీ స్కూల్ నిర్వహణ, యాప్‌లో అప్లోడ్ చేయడం ఇలా అనేక పనులతో సతమతమవుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితిలో పెన్షన్ పంపిణీ చేయడం అంగన్వాడీ కార్యకర్తలకు భారంగా ఉందన్నారు. దీనికి తోడు ఇటీవలే గుంటూరులో రాజకీయ జోక్యం వలన ఒక వర్కర్ను సస్పెండ్ చేశారన్నారు. పెన్షన్ డ్యూటీ నుంచి అంగన్వాడీ వర్కర్లను మినహాయించకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గారాణి, నాయకులు సిహెచ్.రామలక్ష్మి, ఎ.లక్ష్మీ పాల్గొన్నారు.

సబ్బవరం : అంగన్వాడీ వర్కర్స్‌కు పెన్షన్ పంపిణీ విధుల నుండి మినహాయింపునివ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వివి.రమణమ్మ స్థానిక ఎంపీడీఓ పి.పద్మజకు మంగళవారం వినతి పత్రం అందజేశారు.


ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ నేతలు


మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ కర్రి బాబి

టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా కొణతాల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా నడిపల్లి వెంకటేశ్వర కనకయ్య నాయుడు (బోసు బాబు), ఉపాధ్యక్షులుగా మంత్రి సత్యనారాయణ ఎన్నికయ్యారు. మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావు, సంస్థాగత ఎన్నికల పర్యవేక్షకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కరణం శ్రీనివాసరావు సమక్షంలో వారు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, రాపేటి రామ్‌కుమార్, ఆడారి గోవిందరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -మునగపాక : మండల కేంద్రం మునగపాక గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులకు సర్పంచ్ దిమ్మల అప్పారావు, నూకరాజు సోదరులు మంగళవారం పండ్లు, శీతల పానీయాలు పంపిణీ చేశారు. తమ తల్లి దిమ్మల అచ్చియమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా నిరుపేదలకు అన్నదానం, వస్త్ర దానం వంటి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, దానిలో భాగంగా ఈ ఏడాది తమ తల్లి 16 వర్ధంతిని పురస్కరించుకొని ఉపాధి కార్మికులకు శీతల పానీయాలు, పండ్లు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో అప్పారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పండ్లు, శీతలపానీయాలు ఇస్తున్న అప్పారావు కుటుంబ సభ్యులు

పవర్ లిఫ్టర్ నవీన్‌కు అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

జిల్లాస్థాయి ఇటీవల నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన జార్జ్ క్లబ్ జిమ్ విద్యార్థి ఆళ్ళ నవీన్‌ను జార్జ్ క్లబ్ కార్యవర్గం మంగళవారం అభినందించింది. క్లబ్ అధ్యక్షులు బిఎంఎస్‌కె జోగినాయుడు పతకాన్ని నవీన్ మెడలో వేసి అభినందనలు తెలిపారు. 66 కిలోల విభాగంలో చిన్న వయసులోనే పతకం సాధించడంపై కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి అనకాపల్లి కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. కార్యదర్శి కాశీ మాస్టర్, కోశాధికారి చంద్రశేఖర్, జిమ్ ఉపాధ్యాయులు ఎంఎస్ఎస్ అప్పారావు, సభ్యులు పెంటకోట సుబ్రహ్మణ్యం, కోలపర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సిబిఎస్ఇలో సత్తాచాటిన విద్యార్థులు



సత్తాచాటిన శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ విద్యార్థులు

శ్రీ ప్రకాష్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి -నక్కపల్లి: సిబిఎస్ఈ ప్రకటించిన పదవ తరగతి, ప్లస్2 ఫలితాలలో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ ప్రకాష్ తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో ఎన్.సత్య సాయి483/500, ఎమ్ .యశస్వి 482, పి.తరుణ్ కుమార్ 481, ఎస్.రఘునందన్ 478మార్కులు సాధించారని, ప్లస్2 ఫలితాల్లో జి.సాయి అనీష్ 469/500, ధాత్రి నిహారిక 466 సాధించారన్నారు. నూటికి నూరుశాతం ఉత్తీర్ణతా శాతంతో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆయన తెలిపారు. మాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో తమ విద్యార్థులు 100 కి 100 మార్కులు సాధించడం హర్షణీయమని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

రవీంద్ర భారతి విజయదుందుభి



మేఘన

ప్రజాశక్తి -ఆనందపురం : సిబిఎస్ఇ పదో తరగతి ఫలితాల్లో ఆనందపురం మండలం వెల్లంకి రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించినట్లు పాఠశాల ఛైర్మన్ ఎస్.ఎస్.మణి తెలిపారు. 500 మార్కులకు 487 మార్కులతో మేఘ వర్షిని ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. 470 మార్కులకు పైగా ఆరుగురు, 450కి పైగా 12 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. 98 శాతం పరీక్షా ఫలితాలు సాధించినట్లు వివరించారు. కె.ఉజ్వల సాయి 480, వి.షణ్ముఖ 475, ఎస్.భాశ్యశ్రీదేవి 470, తేజస్విని 476, పి.శ్రీ హర్షిత 473, కౌశల్ సింగరాజ్ 470 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థుల అభినందన సభలో పాఠశాలల ఉత్తరాంధ్ర ఇన్చార్జి ఎన్.వెంకటేష్, సిజిఎం జిఆర్.వసంత, పాఠశాల డీన్ ఉమా మహేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



చీడికాడలో చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చీడికాడ:స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా లైబ్రేరియన్ జోగేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథల చదివి వివరించారు. అనంతరం బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. జోగేశ్వరి మాట్లాడుతూ, బాలికలు కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రామ యువత పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై బృంద చర్చలు

ములగాడ : వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో మంగళవారం సామాజిక సమస్యలైన బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మత్తు పదార్థాల వినియోగం, నిరక్షరాస్యత, పర్యావరణ కాలుష్యం, మూఢనమ్మకాలు తదితరాలపై బృంద చర్చలు నిర్వహించారు. సమాజం తీసుకోవలసిన జాగ్రత్తలపై నినాదాలను బాలలు రాశారు. అనంతరం చిన్న పిల్లల కథలను చదివి వినిపించారు. అనంతరం ఆటలను ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



మల్కాపురంలో...

13, 14 తేదీల్లో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-రావికమతం: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 13, 14 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ, 2025-2026 ఏడాదికి గాను ప్రభుత్వం నుంచి మంజూరైన 14 యూనిట్లకు గాను, మండలంలో 28 గ్రామపంచాయతీలలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ఎస్బిఐ రావికమతం, ఏపీజీవీబీ రావికమతం, యుబిఐ రావికమతం, ఎస్బిఐ సీతయ్యపేట బ్రాంచ్ మేనేజర్లు హాజరవుతారన్నారు. ఇంటర్వ్యూలకు విధిగా ధ్రువీకరణ పత్రాలను తీసుకొని హాజరు కావాలన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-కొత్తకోట:కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు తాళ్లపురెడ్డి శేషు ఆర్థిక సాయంతో సమకూర్చిన సుమారు ఏడు వేల విలువైన వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను కొత్తకోట శాఖ గ్రంథాలయానికి మంగళవారం వితరణ గా అందజేశారు. స్థానిక నిరుద్యోగ యువతకు డీఎస్సీ, ఆర్ఆర్బీ, రైల్వే రిక్రూట్మెంట్, పోలీస్ కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను అందించారు. నిరుద్యోగ యువతకు ఈ పుస్తకాలు అందించిన శేషుకు పలువురు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గర్రెడ్డి రాంబాబు, కలం నర్సిరావు, అంగజాల వీర ప్రకాష్, తరిపే ఈశ్వరరావు, గుమ్ముడు వాసు, శాఖ గ్రంథాలయాధికారి వరహా మణి, పలువురు నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్న

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:వ్యాపారవేత్త, మాజీ కౌన్సిలర్ తెలుగుదేశం నాయకులు జాలుమూరి బంగారురాజు పుట్టినరోజు వేడుకల్లో స్పీకర్ అయ్యన్న పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బంగార్రాజు తండ్రి జాలుమూరి జోగారావు , తల్లి జాలుమూరి నూకరత్నం విగ్రహాలను స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆవిష్కరించారు. అనంతరం బంగార్రాజుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కీర్తిశేషులు జాలుమూరి జోగారావు నర్సీపట్నంలో వ్యాపార రంగంలో ప్రముఖులన్నారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా పేదల కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బంగార్రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న నాయకులు

అంబేద్కర్ నాటికపై ప్రచారం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అంబేద్కర్ జీవితంపై సంఘం శరణం గచ్చామి నాటికను జయప్రదం చేయాలని మంగళవారం నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈనెల 14న బుధవారం సాయంత్రం 6గంటలకు నర్సీపట్నం సిటీ క్లబ్ లో కెవిపిఎస్ అధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ ఆకాడమీ వారిచే సంఘం శరణం గచ్చామి నాటకం ప్రదర్శిస్తారన్నారు. అంబేద్కర్ జీవితం, సమాజం కోసం చేసిన కృషి, ఈ నాటక రూపంలో ప్రదర్శించడం జరుగుతుందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి తెలియజేసారు. ప్రజలు అందరూ నాటకం చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు మర్రా నాగరాజు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె. త్రిమూర్తులు రెడ్డి, గిరిజన సంఘం నాయకులు రాము, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు జారీ చేయాలి


ప్రజాశక్తి-దుంబ్రిగుడ:గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే జనన, మరణ ధ్రువపత్రాలను మంజూరు చేయాలని సిపిఎం మండల నాయకుడు, గసభ పంచాయితీ మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు, తొలగింపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు చేయుటకు పలు రకాల ధ్రువపత్రాలు కావాల్సి ఉందన్నారు. రేషన్ కార్డు మంజూరుకు జనన ధ్రువపత్రం, వివాహ ధ్రువపత్రం, మరణ ధ్రువపత్రం అవసరం ఉంటుందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు ఇవి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మన్యంలో కుండపోత వర్షం

-పిడుగుపాటుకు గిరిజనుడు మృతి
-విషాదంలో కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని పరిసర ప్రాంతంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. పిడుగుపాటుకు గుర్రై గిరిజనుడు చెందగా, దుక్కెడు ఎద్దు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....మండలంలోని మాడగడ పంచాయితీ మంజగూడ గ్రామానికి చెందిన సమర్ది డొంబు (58) ఎప్పటిలాగే పశువులు మోపేందుకు గ్రామ సమీపంలో తీసుకెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం 1గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడడంతో డొంబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు పశువు కూడా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

దుంబ్రిగుడ:మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీగా ఎండలు కాయడంతో తీవ్రతకు మండల గిరిజనులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు మూడు గంటల పాటు ఏకధాటిగా పిడుగు శబ్దాలతో కుండ పోత వర్షం కురిసింది. దీంతో వాతావరణం కొంత చల్లబడటంతో మండల వాసులు సేద తీరారు. భారీ వర్షం కారణంగా వీధి కాలువలన్నీ వర్షపు నీరుతో నిండిపోయి పూర్తిగా జలమయంగా మారాయి.



మృతి చెందిన గిరిజనుడు



రామచంద్రన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అంగముత్తు

డిసిఐఎల్‌ను సందర్శించిన రామచంద్రన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:విశాఖపట్నంలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డిసిఐఎల్) కార్పొరేట్ కార్యాలయాన్ని భారత ప్రభుత్వ ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి టి.కె. రామచంద్రన్ సందర్శించారు. ఈ సందర్భంగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పనితీరుపై రామచంద్రన్ సమగ్ర సమీక్ష నిర్వహించారు సీనియర్ నాయకత్వ బృందంతో సమావేశమై ప్రస్తుత మార్కెట్ వాతావరణంలో ఉత్పాదకత పోటీతత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో వ్యూహాత్మక కార్యక్రమాలపై కార్పొరేషన్ దృష్టి పెట్టవలసిన అవసరాన్ని వివరించారు. డ్రెడ్జింగ్ కార్యకలాపాల ద్వారా దేశవ్యాప్తంగా నావిగేషనల్ మార్గాలను నిర్వహించడానికి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అందిస్తున్న సహకారానికి గాను అధికారులను ప్రశంసించారు. ప్రధాన భారతీయ ఓడరేవులలో నావిగేషన్‌ను నిర్ధారించడం ద్వారా సముద్ర వాణిజ్యానికి మద్దతు ఇవ్వడంలో దాని కీలక పాత్ర గురించి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ మాద్దైయన్ అంగముత్తు, కార్యదర్శికి కార్పొరేషన్ వ్యూహాత్మక కార్యక్రమాలు, కీలక పాత్ర గురించి వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులు, ఆర్థిక పనితీరు, తదితర వివరాలు ఆయనకు తెలిపారు. అనంతరం ఆయన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సిఈఓ దుర్గేష్ కుమార్ దూబే, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిడారి

త్వరలో జిఒ 3 తరహాలో మరో జిఒ

-జిసిసి చైర్మన్ శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: నిరుద్యోగ ఆదివాసి యువతకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రభుత్వం న్యాయం చేస్తుందని జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో నెంబర్ 3 తరహాలనే ప్రత్యామ్నాయ జీవో తీసుకు రావడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. ఆదివాసుల హక్కులు చట్టాలు కాపాడుతు వస్తున్నది తెలుగుదేశం పార్టీయేనని తెలిపారు.డిఎస్‌సి ద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేదని వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవో .3 రద్దయితే కనీసం జగన్మోహన్ రెడ్డి నోరు మెదపలేదని విమర్శించారు. జీవో .3పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన సంక్షేమ శాఖ అధికారాలతో సమీక్షా నిర్వహించి మరో జీవో తీసుకురావడానికి ప్రయత్నం చేయడంపై ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, గూడ సర్పంచ్ జ్ఞానప్రకాష్, శోభకోట సర్పంచ్ పలసీ శశి భూషణం నాయుడు, హుకుంపేట మండల ప్రధాన కార్యదర్శి సిర్గం సూర్యకాంతం, ముంచంగిపుట్టు మండల ప్రధాన కార్యదర్శి కొంతేరి జాగత్రాయ్, క్లస్టర్ ఇంచార్జి రూడి త్రినాధ్, యూనిట్ ఇంచార్జి మజ్జి చిన్ని పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన మోదకొండమ్మ ఉత్సవాలు

▶▶ భారీగా తరలివచ్చిన భక్తులు ▶▶ ఘనంగా ఘటాల ఊరేగింపు ▶▶ ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



భారీగా తరలి వచ్చిన జనం

ప్రజాశక్తి-పాడేరు, పాడేరుటౌన్: జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో మూడు రోజులు పాటు జరిగిన మోదకొండమ్మ ఉత్సవాలు జన ప్రభంజనంగా సాగాయి. మూడవ రోజు మంగళవారం మోదకొండమ్మ ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. వేలాదిమంది భక్తులు అమ్మవారి ఉత్సవాలలో పాల్గొన్నారు. అర్ధరాత్రి దాటే వరకు కూడా సందర్శకులతో పాడేరు పట్టణ రోడ్లన్నీ కిక్కిరిసి పోయాయి. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆదివాసి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రంతా పాడేరు పట్టణంలో జన జాతర సందడిగా సాగింది. దూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి తమ తమ బంధువుల ఇళ్లకు చేరి మంగళవారం అణుపు ఉత్సవం రోజున ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా వేకువ జాము నుంచి అమ్మవారి ఆలయం వద్ద శతకంపట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు..

శతకంపట్టు వద్ద ఆదివారం అమ్మవారిని కొలువు తీర్చినప్పటి నుంచి తమ తమ ఇళ్లల్లో ఘటాలను ప్రతిష్ఠించుకొని మూడు రోజులు నుంచి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమలతో పూజలు చేసి వాటిని కుటుంబ సమేతంగా భక్తులు ఊరేగింపుగా ఘటాలను తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ ఘటాల ఊరేగింపు కొనసాగింది. డప్పు వాయిద్యాలు, ధూప దీపాలతో ఈ ఘటాల ఊరేగింపు సంబరంగా సాగింది.

మోదమ్మను దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి

పాడేరు:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ఉత్సవాల సందర్భంగా మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ లాంఛనాలతో మంత్రికి ఆలయ కమిటి సభ్యులు స్వాగతం పలికారు. శతకం పట్టు వద్దకు వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ,అర్హులందరికి పథకాలు అందించడానికి ముఖ్య మంత్రి కృషి చేస్తున్నారన్నారు. జి.ఓ 3 కు ప్రత్యామ్నాయంగా వేరొక జిఓ జారీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్య మంత్రి త్వరలోనే అల్లూరి సీతారామ రాజు జిల్లా ను సందర్శిస్తారని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, ఎస్పీ అమిత్ బర్దార్, పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి



నేల వేషాలు వేస్తున్న కళాకారులు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఎం.హేమలత, ఐసిడి ఎస్ పిడి ఎన్. సూర్య లక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఝాన్సీరాణి పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సమాచార శాఖ జెడి

సమాచార పౌర సంబందాల శాఖ జోన్ -1 సంయుక్త సంచాలకులు వి. మణిరాం మంగళవారం మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జెడి మొక్కులు చెల్లించుకుని అమ్మవారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ముందుగా పిఎంఆర్ సి కి చేరుకున్న జెడి ని జిల్లా పౌర సంబంధాల అధికారి పి.గోవింద రాజులు, ప్రత్యేక ప్రచారం విభాగం సహాయ ప్రాజెక్ట్ అధికారి పి. రాములు ఆహ్వానం పలికారు. అనంతరం ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన స్టాళ్ళలో సమాచార శాఖ ఆద్వర్యంలో నిర్వహించిన చాయా చిత్ర ప్రదర్శన తిలకించి అభినందించారు.ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విస్తతంగా ప్రచారం చేయడంలో అధికారులు నిరంతరం కృషి చేయాలని, ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలపై ప్రజాభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు పి.శ్రీనివాసరావు, జూనియర్ సహాయకులు కె. సంద్యారాణి, రికార్డు సహాయకులు కె. మోహన్ రావు, టైపిస్ట్ ఇ. శ్రీనివాస రావు, ఫోటోగ్రాఫర్ గమ్ బహదూర్, సిబ్బంది పి.వరలక్ష్మి, బి.పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన విసిసి సమ్మర్ క్యాంప్

తప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:విసిసి పిఠాపురం కాలనీ క్లబ్ సమ్మర్ క్యాంప్ మంగళవారం ముగిసిందని విసిసి మద్దిలపాలెం కన్వీనర్ అత్తిలి మణి తెలిపారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ అద్వర్యంలో కాలనీ పార్క్‌లో 15 రోజులు పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపులో పిల్లలు చేతితో చేసిన డ్రాయింగ్, బీడ్స్ వర్క్, కుట్లు, ఆకులతో బొమ్మలు, గింజలతో బొమ్మలు, పాట్ పెయింట్, క్రాఫ్ట్ వర్క్, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్. ఇలా చాలా క్రియేటివ్ గా తయారు చేశారు. మే డే రోజు కార్మికులు చేస్తున్న పనులు డ్రాయింగ్స్ వేసి తీసుకొచ్చారు. డాన్సులు చేయడం కొత్త కొత్త ఆటలు, పాత ఆటలు ఆడటం ఇదంతా 15 రోజులు చాలా చాలా ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా వారు పళ్ళు పూలు కూరగాయలు గేమ్, బాహుబలి గేమ్, కోకో గేమ్, జస్ట్ మిస్, 2 ఫీలింగ్ హంగ్రీ,3 లక్కీ ఫెలో,4 రింగా రింగా,కథలు చదివి చెప్పడం, కథలు రాసారు,గట్టు చెరువు ఆట, కోఆర్డినేషన్ గేమ్ ఇంకా ఇండోర్ అవుట్డోర్ గేమ్స్ ఆడించడం జరిగిందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా క్యాంపు నిర్వహణ కు సహకరించిన రిసోర్స్ పర్సన్స్ స్థానిక



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

కాలనీ వాసులకు, డోనార్స్, పేరెంట్స్ కు ధన్యవాదములు తెలియజేసారు. ఈ క్యాంపులో కర్ర సాము కూర్మారావు, లక్ష్మన్ రావు నీలవేణి, ప్రజా ఆరోగ్య వేదిక కామేశ్వరరావు, యువజన సంఘం నాయకుడు సంతోష్, ఆసరా చారిటబుల్ సొసైటీ శ్రీనాథ్, పిల్లల పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ 16 రోజుల క్యాంపు కు విసిసి కన్వీనర్ కె.సుశీల సారధ్యంలో కళ్యాణి, ధనలక్ష్మి, భాగ్య లక్ష్మి బృందం నిర్వహించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -అనంతగిరి:సమస్యల నడుమ మల్లెపాడు పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను మంజూరు చేశారు. ఏప్రిల్ నెల 23వ తేదీన సమస్యల నడుమ మల్లెపాడు కథనంలో కర్రలే విద్యుత్ స్తంభాలు పేరుతో ప్రచురితమైంది.దీంతో, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాలు మంజూరు చేశారు. దీంతో గ్రామస్తులు మంగళవారం మెయిన్ రోడ్డు నుండి గ్రామం వరకు కర్రల సాయంతో స్తంభాలను భుజంపై మోసి దట్టమైన అటవీ మార్గం మీదుగా ఆరు కిలోమీటర్ల దూరం తరలించారు.

కిశోర బాలికలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి. చింతపల్లి :-కిషోర్ బాలికల్లో లక్ష్యసాధనపై అవగాహన పెంచడం ఎంతో అవసరమని చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి.వెంకటరమణి అన్నారు. మంగళవారం ఆమె ఐసిడిఎస్ అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ఎం.రామలక్ష్మితో కలిసి మండలంలోని కొత్తపాలెం, తాజంగి సచివాలయాల పరిధిలోని కోరుకొండ, బలబద్రం అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. కిశోర బాలికల భద్రతపై తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు తల్లిదండ్రుల అనుమతితోనే బంధువుల గ్రామాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.